క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సత్తెనపల్లి రూరల్ సీఐ ఎమ్.రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలుదేవర్లపాడు, గోళ్లపాడు, కుందురువారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై ఎస్సై పి.హజరతయ్యతో సమీక్షించారు. ఆయా కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

వైఎస్సార్ క్రాంతిపథం సీసీపై విచారణ



దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామ సచివాలయంలో వైఎస్సార్ క్రాంతిపథం సీసీ నాగమల్లేశ్వరరావుపై మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మూడు డ్వాక్రా గ్రూపులకు సంబంధించి లావాదేవీల్లో అక్రమాలు జరిగాయంటూ వీఓఏ ఎల్.జానకీరాణి జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. మూడు డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన స్త్రీనిధి చెల్లింపులను బ్యాంకుకు జమ చేయకుండా అవకతవకలకు పాల్పడి గ్రూపు సభ్యులను మల్లేశ్వరరావు ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దమ్మాలపాడు గ్రామ సచివాలయంలో జరిగిన విచారణకు స్త్రీ నిధి జిల్లా ఏజీఎమ్ చిన్నబుల్లయ్య, లీగల్ కోఆర్డినేటర్ కనకారావులు హాజరై సంబంధిత గ్రూపు సభ్యుల నుంచి వివరాలు నమోదు చేసుకొన్నారు. ఏపీఎం బాలస్వామి తదితరులు ఉన్నారు.

తప్పుడు ప్రచారాలను మానుకోవాలి

రాజుపాలెం: పులిచింతల ప్రాజెక్టు పునరావాస కేంద్రాలలో నిర్వాసితుల ఇళ్ల పట్టాల ఉచిత రిజిస్ట్రేషన్‌లపై ఎల్లో మీడియా, టీడీపీ కార్యకర్తలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని రాజుపాలెం పునరావాస కేంద్రానికి చెందిన జీడీసీఎంఎస్ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ మండిపడ్డారు. డబ్బులు వసూలు చేస్తున్నారని ఒక పత్రిక(సాక్షికాదు) రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. మండలంలో మూడు పునరావాస కేంద్రాలలో 1893 ఇళ్ల ప్లాట్లు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 100 మందికి పైసా తీసుకోకుండా రిజిస్ట్రేషన్‌లు చేయడం జరిగిందని తెలిపారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు డబ్బులు తీసుకుంటున్నారని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆపాలనే దురుద్దేశంతో ఉన్నారని దుయ్యబట్టారు.

పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేత



అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలుకు 1996–97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం రూ.25 వేలు విలువచేసే సీసీ కెమెరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని చిగురుపాడు కల్యాణికి అందజేశారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. పాఠశాలకు వాచ్ మెన్ కూడా లేకపోవడంతో గత కొంత కాలంలో పాఠశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారింది. వీరి ఆట కట్టించేందుకు 24 గంటలు పాఠశాలపై నిఘా నేత్రాలు కనిపెట్టుకుని ఉండే విధంగా పాఠశాలకు నలువైపులా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు పూర్వవిద్యార్థులు ముందుకు వచ్చారు.

పేటలో యువకుడి ఆత్మహత్య

చిలకలూరిపేట టౌన్: తన ప్రేమ విఫలం అవుతుందన్న భయంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వెలుగు చూసింది. అర్బన్ పోలీసుల కథనం ప్రకారం పట్టణంలో టిడ్కో గృహా ల్లో నివసించే గుగులావత్ గోపీచంద్ నాయక్ (23) కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సమీపంలో ఉన్న మైనర్ బాలికను ప్రేమించాడు. వీరి ప్రేమ వ్యవహారం తెలిసి గోపిచంద్ బంధువులు బాలిక తల్లి దండ్రులతో మాట్లాడితే వివాహానికి సమయం ఉందని, చదువు పూర్తి అయిన తదుపరి మాత్రమే వివా హం జరిపిస్తామని చెప్పారు. ఈ విషయం తెలిసి, ప్రేమించిన బాలికతో వివాహం జరగదని మనస్థాపంతో గోపిచంద్ సోమవారం రాత్రి చెరువు రోడ్డు లోని చెట్టుకు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు తల్లి రుక్మిణిబాయికి సమాచారం అందించారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ తరగతులు.. భవితకు బాటలు

- మారుతున్న సర్కారు బడుల రూపురేఖలు
- డిజిటల్ బోధనతో విప్లవాత్మక మార్పులు
- మండలంలో బడులకు 167 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్
- ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్ఐఈలు, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలు
- 1,289 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

సత్తెనపల్లి: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో డిజిటల్ తరగతులు అందుబాటులోకి రావడంతో పాటు ఆంగ్ల బోధన వైపు సర్కారు దృష్టి సారిస్తోంది. దీంతో ప్రభుత్వ బడులు డిజిటల్ శోభను సంతరించుకుంటున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేద పిల్లల చదువులకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. అమ్మఒడితో ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు నాడు- నేడుతో పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చివేశారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా డిజిటల్ చదువులకు శ్రీకారం చుట్టారు. ఆధునిక బోధనా విధానాలను అనుసరిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ రీతిలో బోధన అందించాలనే ఉద్దేశంతో ప్రతి తరగతి గదిలో డిజిటల్ విద్యాబోధనకు చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక తరగతి విద్యార్థులకు స్మార్ట్ టీవీలు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. విద్యార్థికి పాఠాలు సులభతరంగా అర్థమయ్యేలా డిజిటల్ కంటెంట్లు అందుబాటులోకి వచ్చాయి. డిజిటల్ విద్యతో గతంలో కంటే పిల్లలు ఎంతో ఆసక్తితో పాఠ్యాంశాలను అభ్యసిస్తున్నారు.



ప్రభుత్వ బడులు డిజిటల్ పాఠశాలలుగా మారిపోయాయి. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటే పెచ్చులూడిపోయిన శిథిల భవనాలు, నీటి సౌకర్యం లేని మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత, పాఠ్య పుస్తకాలు సకాలంలో అందక విద్యార్థుల అవస్థలు కనిపించేవి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాడు–నేడుతో నూతన భవనాలు, అత్యాధునిక వసతులు కల్పించింది. పేదింటి పిల్లలు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసించాలనే ఉద్దేశ్యంతో ఆంగ్ల మాధ్యమంలో బోధన, డిజిటల్ తరగతులకు శ్రీకారం చుట్టింది.



జెడ్పీ పాఠశాలలో ఐఎఫ్‌పీల ద్వారా బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు



ట్యాబ్‌లను చూపుతున్న 8వ తరగతి విద్యార్థులు

స్మార్ట్ స్టడీస్...

సత్తెనపల్లి మండల పరిధిలో 69 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత, 18 ఉన్నత పాఠశాలలు వెరసి మొత్తం 93 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో మన బడి, నాడు–నేడు మొదటి, రెండో విడతలో దాదాపు అన్ని పాఠశాలల్లో పనులు చేపట్టారు. ఈ పాఠశాలల్లో 167 ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 76 స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశారు. అదే విధంగా 8వ తరగతి చదువుతున్న 1,289 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్లానెల్స్, స్మార్ట్ టీవీలు కంప్యూటర్ కంటే వేగంగా పనిచేస్తాయి. క్లాసులో పాఠాలు చెప్పేందుకు బ్లాక్ బోర్డ్, గ్రీన్ బోర్డ్ అవసరం లేదు. డిజిటల్ స్క్రీన్ మీద అక్షరాలు రాస్తుంటే ఏ రంగులో కావాలంటే ఆ రంగులో అక్షరాలు కనిపిస్తుంటాయి. బోర్డుపై చెప్పిన పాఠమంతా చెరిపేస్తే చెరిగి పోతుంది. సేవ్ చేస్తే స్లైడ్‌గా ఉండిపోవడమే కాక తరువాత రోజు పాఠం చెప్పేముందు ముందురోజు పాఠాన్ని మళ్లీ గుర్తు చేసేందుకు ఈ స్లైడ్‌లను వాడుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పాఠాన్ని పీడీఎఫ్ రూపంలో స్క్రీన్ మీద చూపిస్తూ విద్యార్థులకు వివరించవచ్చు. పాఠాలను మరింత బాగా అర్థం చేసుకునేందుకు ఇంటర్నెట్‌లోని రంగుల ఫోటోలు, గ్రాఫ్‌లు, వీడియోలను విద్యార్థులకు చూపిస్తూ పాఠ్యాంశాలను బోధించడం వల్ల విద్యార్థుల్లో ఆసక్తి పెరిగి వారిలో ఆలోచనా శక్తి పెరుగుతోంది.

మండలంలోని పాఠశాలల వివరాలు..	
ప్రాథమిక పాఠశాలలు	69
ప్రాథమికోన్నత పాఠశాలలు	06
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	18
మొత్తం విద్యార్థులు	10,545
ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్	167
స్మార్ట్ టీవీలు	76
విద్యార్థులు వద్ద ట్యాబ్‌లు	1,289

పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతున్నాయి



మా పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలను ఆడియో విజువల్ ద్వారా చూస్తూ వినడం వల్ల చదువుపై ఆసక్తి పెరగడమే కాకుండా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెరుగుతోంది. భౌతికంగా చూడలేని దృశ్యాలను చూపిస్తూ పాఠ్యాంశాలను బోధిస్తున్నందున పాఠం సులువుగా అర్థమవుతుంది. బాగా చదువుకునేందుకు ఈ విధానం బాగుంది.

–షేక్‌షాహిద్, 8వ తరగతి, సత్తెనపల్లి

కొత్తగా అనిపిస్తుంది



డిజిటల్ విద్య అంటే ప్రైవేటు పాఠశాలలకు మాత్రమే పరిమితం అనుకునేవాళ్లం. కానీ ఆ పాఠశాలలకు మించి మా పాఠశాలలో ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా డిజిటల్ విద్యను అందిస్తున్నారు. దీని ద్వారా సులువుగా నేర్చుకుంటున్నాము. మాకు భవిష్యత్తు లో ఉన్నత చదువుల్లో రాణించేందుకు అవకాశం కలుగుతుంది. తేలిగ్గా పాఠ్యాంశాన్ని అర్థం చేసుకునే అవకాశం వచ్చింది.

–ఏ.మంజులారెడ్డి, 8వ తరగతి,సత్తెనపల్లి

ట్యాబ్‌లతో ఎంతో ఉపయోగం



పాఠశాలలో డిజిటల్ విద్యావిధానంతో విద్యను అందిస్తున్నారు. చెప్పిన పాఠం అర్థం కాకపోతే మాన్యువల్ గా రాసి చూపిస్తున్నారు. పాఠాలను ఆడియోలు, వీడియోల ద్వారా వినే అవకాశం కల్పించారు. ఏదైనా అసైన్‌మెంట్ ఉంటే వాటిని ఇంటి దగ్గర చూసుకొని నేర్చుకునేందుకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి.

–టీ.నంద సమీర్, 8వ తరగతి, సత్తెనపల్లి


పాఠ్యాంశాలను మరచిపోరు



విద్యార్థులకు అర్థం కాకపోతే వీడియోల రూపంలో ఉన్న పాఠ్యాంశాలను చూపిస్తాము. ప్రాక్టికల్‌గా వారికి చూపించలేము. కనుక వీడియోల ద్వారా చూపించడంతో బాగా అర్థం చేసుకుంటారు. అప్పటికీ అర్థం కాకపోతే మాన్యువల్‌గా రాసి చూపిస్తాం. అర్థం కాని పాఠాలను తిరిగి వారికి రివిజన్ చేసి చూపించడం ద్వారా మరిచిపోలేరు. ప్రాక్టికల్‌గా పాఠం సారాంశం వారికి అర్థమవుతుంది.

–కె.లతాప్రియదర్శిని, హెచ్‌ఎం, జెడ్పీ పాఠశాల, సత్తెనపల్లి.

రైలు కింద పడి వృద్ధుడు మృతి



పిడుగురాళ్ల: రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన పిడుగురాళ్లలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పిడుగురాళ్ల రైల్వే సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు తెలిపారు. అతని వయస్సు సుమారు 65 నుంచి 70 సంవత్సరాలలోపు ఉంటుందని అన్నారు. అతని ఒంటిపై నీలి రంగు స్వెట్టర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు పిడుగురాళ్ల రైల్వే సీఐను సంప్రదించాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9701379709 సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పిడుగురాళ్లరూరల్: పనుల నిమిత్తం ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో గాయాలైన ఘటన మండలంలోని అంజినీపురం బైపాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరారెడ్డి, రామిరెడ్డి పొలం పనుల నిమిత్తం దాచేపల్లి వైపు వెళ్తుండగా గుంటూరు వైపు నుంచి దాచేపల్లి వైపు వెళ్తున్న కారు బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వీరారెడ్డి, రామిరెడ్డిలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే టోల్‌ప్లాజా అంబులెన్స్ ద్వారా గాయపడిన వారిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

503 మందికి వైద్య పరీక్షలు

మాచవరం: పిన్నెల్లి సచివాలయం-1 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 503 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులకు గైనకాలజిస్టు డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు తెలియజేశారు.

వృద్ధులకు ఇంటి వద్దే ఓటుపై పరిశీలన

- 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈసీ పరిశీలన
- సత్తెనపల్లి ఆర్‌డీవో మురళీకృష్ణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలిస్తుందని సత్తెనపల్లి రెవిన్యూ డివిజినల్ అధికారి వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలంటే 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. వైకల్యం కారణంగా శరీరం సహకరించక పోవడంతో సహాయకులు ఉంటే గానీ పోలింగ్ కేంద్రాలకు వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. వీరి కష్టాలు గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం రాబోయే ఎన్నికల్లో ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇందుకు మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. దీనికి పూర్తి స్థాయిలో విధి విధానాలు రావలసి ఉందన్నారు. ఇంటి వద్దనే మొబైల్ ఓటింగ్ ద్వారా 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఫారం-12డీ తో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద ఉన్న బీఎల్ఓ ల ద్వారా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తులు అందించాలన్నారు ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితాలో డబల్ ఎంట్రీల అంశాన్ని ప్రస్తావించగా ఎట్టి పరిస్థితుల్లోనూ డబల్ ఎంట్రీలు లేకుండా చూస్తామన్నారు. పలువురి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో తహసీల్దార్లు సీహెచ్.ఉష(సత్తెనపల్లి), ఎం.లక్ష్మీనారాయణ (నకరికల్లు), మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, రాజుపాలెం డిప్యూటీ తహసీల్దార్ ఏ.నళిని, ముప్పాళ్ళ డిప్యూటీ తహసీల్దార్ సీ.లక్ష్మీప్రసాద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

కేంద్రం వ్యతిరేక విధానాలపై పోరాటం

క్రోసూరు: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదామని సీపీఐ పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు బైరాపట్నం రామకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం క్రోసూరులో మండల కార్యదర్శి పి.నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్న మోదీ ప్రజావ్యతిరేక నిర్ణయాలతో ప్రజాకంటక పాలన సాగిస్తున్నారని అన్నారు. అధిక ధరలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటం లాంటి ప్రజావ్యతిరేక విధానలతో ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయారన్నారు. ఈ అంశాలపై సీపీఐ పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. వృద్ధాప్యపు పింఛన్ రూ.3వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోతుగంటి నాగరాజు, యాదగిరి, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కొండవీడు ఖ్యాతి దశదిశలా వ్యాప్తి చెందాలి

యడ్లపాడు: చారిత్రక పర్యాటక ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా కొండవీడు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. స్థానిక కొండవీడు కోటను మంగళవారం రాత్రి ఆయన వివిధ శాఖల అధికారులతో సందర్శించారు. చెక్‌పోస్టు వద్ద నుంచి కొండపై ఉన్న చారిత్రక ప్రదేశాలు, పురాతన కట్టడాలు, రాష్ట్ర ప్రభుత్వ కొండవీడు-నగరవనంలో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపై గజబోలలో జిల్లా అధికారులతో ఉత్సవాల నిర్వహణపై సమీక్షను ఏర్పాటు చేశారు. ఉత్సవాలను గురించి కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 10, 11 తేదీల్లో కొండవీడు ఫెస్ట్–2024 పేరుతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులకు ఆసక్తి, ఆకర్షణతో పాటు కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేందుకు పలు కార్యక్రమాలను అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. ఉత్సవాల సందర్భంగా హెలీకాప్టర్, హాట్ బెలూన్, హార్స్ రైడింగ్, పారా మోటర్ గ్లెడ్డింగ్, బోటింగ్, సైకత శిల్పాల ఏర్పాటు సందర్శకులకు ప్రత్యేకంగా ఆకట్టుకుంటాయన్నారు. వీటితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. హెలిప్యాడ్ నిర్మాణం, హాట్ బెలూన్, హార్స్ రైడింగ్, పారా మోటర్ గ్లెడ్డింగ్, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన వేదిక, చిన్నారులకు ప్లే ఏరియా, సైకత శిల్పాలు తదితర వాటిని ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్న విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఆయా ప్రదేశాలను స్వయంగా పరిశీలించారు. ఆయా పనుల్ని వేగవంతంగా చేయాలని ఆదేశించారు. ఉమ్మడి కృష్ణా, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి ఈ ఉత్సవాలకు భారీగా వచ్చేలా ఆయా శాఖల అధికారులు, మీడియా, ఈ ప్రాంత ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. కొండవీటికోట పర్యాటక కేంద్రంగా మరింత ఖ్యాతి గణించి, గిరిదుర్గం చారిత్రక అంశాలు దశదిశాలా వ్యాప్తి చెందాలని ఈఫెస్ట్ అంతిమ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు.



ఉత్సవాలలో చేపట్టాల్సిన వివిధ ప్రాజెక్టులను వివరిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామానికి చెందిన గొళ్లపూడి శ్రీనివాసరావును పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బంధువులు గొళ్లపూడి రామారావు, గొళ్లపూడి కొండయ్య మరి కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం ప్రకా రం.. శ్రీనివాసరావు బైక్‌పై నరసరావుపేటకు వెళ్తు న్నాడు. బైక్‌పై వెళ్తున్న శ్రీనివాసరావును విప్పర్లపల్లి సమీపంలోకి రాగానే గొళ్లపూడి రామారావు, కొండయ్య మరో ఇద్దరు ఆటోతో బైక్‌ను ఢీకొట్టారు. బైక్ మీద నుంచి కింద పడ్డ శ్రీనివాసరావును వారు కొట్టి తీవ్రంగా గాయపరిచారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కేపీ రవీంద్ర సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తీవ్ర గాయాలైన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

గురుకులానికి దరఖాస్తులు ఆహ్వానం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్.వి.రమణమ్మ మంగళవారం తెలిపారు. 5వ తరగతి ప్రవేశానికి ఈ విద్యా సంవత్సరం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఇంటర్ ప్రవేశానికి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈ నెల 23వ తారీకు లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఏ ప్రాంతం వారైనా అర్హులని తెలిపారు. ఎవరికైనా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం తెలియకపోతే ఉప్పలపాడు పాఠశాలకు రావాలని తెలిపారు.

అక్రమ మద్యం కేసులో..

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సీఐ నయనతార మంగళవారం తెలిపారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద పట్టుబడిందన్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

పిడుగురాళ్ల: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు తెలిపారు. పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద కేఎస్ఆర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల ఎంవీఐ శివనాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలని సూచించారు. నేటి ప్రపంచంలో ఫోన్ ఎంత ఉపయోగమో, అంత ప్రమాదకరంగా మారిందని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం ప్రాణాలకే ప్రమాదమని, ఇది గ్రహించి వాహనాలను నడపాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమని యువత కచ్చితంగా తెలుసుకొని జాగ్రత్తలు పాటించాలని, మద్యం సేవించటం ఆరోగ్యానికి హానికరమని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో చిన్న చిన్న గాయాలకే ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందని, అందుకే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జాగ్రత్తలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ప్రజల ముంగిటకు సంక్షేమ పాలన



రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



విలేజ్ హెల్త్ క్లినిక్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

- పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- అమరావతిలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

అమరావతి: ప్రజల ముంగిటకు పాలనను తీసుకు వచ్చి గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ వ్యవస్థలను మరింత బలోపేతం చేసేందుకు నూతన భవనాలను నిర్మాణం చేశామని పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు అన్నారు. మండల పరిధిలోని ఉంగుటూరులో మంగళవారం గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసాకేంద్రంతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి 520 సేవలను ప్రజల ముంగిటకు తెచ్చేందుకు గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో చిత్తశుద్ధితో అభివృద్ధి , సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు టీడీపీ వ్యవస్థలను వాడుకుంటూ కుట్రలు చేస్తుందన్నారు. తొలుత ప్రజాప్రతినిధులతో కలిసి రూ.43.60 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.24 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభించి శిలాఫలకాల్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాయపాటి శివ, శేషయ్య తదితరులతో పాటు పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్దూరు వాగుపై బ్రిడ్జి పనుల పరిశీలన

మండలంలో పెదమద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు.ప్రయాణికుల ఇక్కట్లను గమనించి పెదమద్దూరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం వేగంగా పూర్తిచేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

అమరావతి పంచాయతీ కాంప్లెక్స్ ప్రారంభం

స్థానిక గ్రామ పంచాయతీ అధ్వర్యంలో రూ.35 లక్షల నిధులతో నిర్మించిన 12 గదుల షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజేశ్వరి, ఉపసర్పంచ్ నిమ్మా విజయ సాగరబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లు వేగవంతం చేయాలి

ముప్పాళ్ళ: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రకియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని మాదల గ్రామ సచివాలయంలో జరుగుతున్న ఎస్‌పీఐ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన రిజిస్ట్రేషన్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఉచితంగా గ్రామ సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు అందించిన ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేయించి హక్కు పత్రం అందించటం జరుగుతుందన్నారు. ఇంటి పట్టాల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ